## మినీ కథ

ఎంతకీ ముక్క వేయకపోయేసరికి తలెత్తి చూశాడు సుందరం.

రాజు దృష్టి చేతిలోని పేకమీద కాక ప్రక్క డాబా మీద బట్టలు ఆరవేస్తున్న సౌదామిని మీద ఉండటం గమనించి "ఆమెకు పెళ్ళయింది" అన్నాడు నవ్వుతూ.

"ఆమె వివరాలు చెప్పు" అన్నాడు ఆసక్తిగా.

"ఆమె భర్త మిలిట్రీ ఆఫీసరయి ఉండవచ్చు. ఆరునెలల కొకసారి వచ్చి రెండు నెలలుండి వెళ్ళిపోతాడు. అయినా పెళ్ళయిన ఆడది సోదరితో సమానమని చెప్పలేదా మనగురువులు" అన్నాడు సుందరం చిరునవ్వుతో.

"నీతి శతకం ఆపరా" విసుక్కున్నాడు రాజు.

"కాలేజీ అమ్మాయి కాదు. నిప్పుతో లోకి వెళ్ళకూడదు" స్నేహితుడి సంగతి తెలిసి మందలించాడు.

"పిరికివెధవ్వి ప్రయత్నించి చూస్తాను నిప్పు కాలితే మళ్ళ చూసుకుని ముచ్చట పడతాను" అన్నాడు కొంటెగా.

"మచ్చపడదు బూడిద మిగులుతుంది" అన్నాడు కోపంగా.

లేచి నిలబడి పేక టేబుల్ మీద వేసి. ప్రక్కఇంటి మేడమెట్లు చకచకా ఎక్కుతున్న రాజుని ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు సుందరం.

"బి.ఎ. ఫైనల్ చదువుతున్నాను మా ఇంటివారమ్మాయి పెళ్ళి. రూం అర్జంట్ గా ఖాళీ చెయ్యమన్నారు" తల వంచుకుని వినయంగా మాట్లాడుతున్న రాజుమీద జాలి కల్గి అతని అభ్యర్థనని కాదనలేక అతను పదిరోజులలో గది వెతుక్కుని వెళ్ళిపోయే ఒప్పందంమీద. ఒక గది ఖాళీచేసి అతనికిచ్చింది సౌదామిని.

మూడునెలలు జరిగిపోయాయి. రాజుకి గది దొరకలేదు. వాళ్ళిద్దరూ మంచి స్నేహితులైపోయారు.

ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని భయపడుతున్నాడు సుందరం.

* * *

"రాజూ" గట్టిగా అరిచింది సౌదామిని.

"ఇంకా కొన్ని నిజాలు చెప్పనా? మా యింటి వారమ్మాయి పెళ్ళి అబద్ధం. నీ కోసమే ఆ కథ అల్లి నీ ప్రక్కన రూం సంపాదించాను. ఈ మూడు నెలలూ నీ అంతట నీవు దగ్గరకొస్తావని ఎదురు చూశాను. ఇక ఇప్పుడు మీ ఆయన వస్తాడని తెలిసిన తరువాత ఆలస్యం చెయ్యకూడదనిపించింది. మర్యాదగా లొంగిపోతే రేపే రూం ఖాళీచేసి వెళ్ళిపోతాను. కాదంటే భర్త లేడని ఇన్నాళ్ళూ ఉంచుకుని




అతడొచ్చే వేళకు గెంటేస్తున్నట్టు పుకారు పుట్టిస్తాను. ఇప్పటికే మన గురించి ఈ సందులో గుసగుసలు బయలుదేరేయి. నీ భర్త అనుమానం మనిషని చెప్పేవు కదా. విడాకులు ఖాయం ...." హేళనగా మాట్లాడుతున్న అతనివంక అసహ్యంగా చూసింది.

తనను తాను నిగ్రహించుకుని "రెండు రోజులు ఆలోచించుకోనీ" అంది తల వంచుకుని

ఆనందంగా ఈలవేశాడు రాజు.

ఆమె చెయ్యి అందుకుని ముద్దుపెట్టుకుని. "నాకు తెలుసు నేనంటే నీకిష్టమే. బెట్టు చేస్తున్నావు కదూ!" అన్నాడామెవంక చిలిపిగా చూస్తూ.

* * *

సాయంత్రం అయిదు గంటలు అవుతూంది. డాబా పిట్టగోడమీద కూర్చుని చందీదాస్ 'హిమజ్వాల' ఏకాగ్రంగా చదువుతున్న రాజుని గమనించింది సౌదామిని.

'ఇరవై ఏళ్ళ వయసులో ఇంతకి తెగించిన ఇతడు ముందు ముందు ఇంకెన్ని సంసారాలు కూలుస్తాడో!'

ఆమె ఒక నిర్ణయానికి వచ్చి క్రిందకి చూసింది. నవంబరు తుఫానుకి కూలిపోయిన ప్రహరీగోడల రాళ్ళు పేర్చబడి ఉన్నాయి క్రింద.

అనుకున్నపని పూర్తిచేసి గదిలోకొచ్చి పడింది. పది నిముషాలకి తను కూడా క్రిందకి వెళ్ళింది.

"పిట్టగోడమీద కూర్చుని చదువుకో వద్దు నాయనా అని యెన్నిసార్లు చెప్పేనో! విన్నాడు కాదు" అంటున్నాడు ప్రక్కంటి ముసలాయన.

"దెబ్బ కణతకి తగిలిందేమో. వెంటనే ప్రాణంపోయింది" అంటున్నాడు యెదురింటి పార్థసారధి.

మూడు రోజులు జరిగిపోయింది రాజు చనిపోయి! సౌదామిని నీరసించిపోతోంది. 'తప్పు చేశానేమో నచ్చచెప్పవలసింది' —అది ఆమె బాధ.

పోస్టుమాన్ కవరు ఇచ్చి వెళ్ళేడు. అపరిచితమైన దస్తూరి.

బాధపడకండి. నేరానికి శిక్ష అనుభవించవలసిందే. కొన్నాళ్ళు ఈ వూరికి దూరంగా వెళ్ళండి. మీ మనసు స్థిమిత పడుతుంది.

మీ శ్రేయోభిలాషి
సుందరం

నిశ్చేష్టురాలయింది. తన రహస్యం మరొకరికి తెలుసు. భయంతో ఆమె ఒళ్ళు జలదరించింది.

మరునాడే పుట్టింటికి వెళ్ళిపోయింది సౌదామిని. ★

అపర్ణా దీక్షిత్